# అమ్మ దొరికింది

**చం**దమామలాంటి మొహం, పెద్ద పెద్ద కళ్ళు, కొనదేరిన ముక్కు, ఎంచక్కని పెదవులు, చక్కని పలువరస, నవ్వితే సొట్ట పడుతున్న బుగ్గ, నల్లని ఒత్తైన జుట్టు.....అచ్చం అమ్మలానే ఉంది!

నా ఒంట్లో రక్తంలో మెదడులో ఏదో తెలీని సంచలనం!

శరణాలయపు ఇనుప గ్రిల్‌డోర్ లోంచి ఆఫీసు గదిలో కూర్చున్న కొత్తామె వంక ఆత్రంగా చూశాను. ఆరాటంగా చూశాను.

ఆమె కళ్ళు - నేను చేతులు కట్టుకుని గడగడా పాఠం అప్పజెప్పినప్పుడు అమ్మ చూసినట్టుగానే చూస్తున్నాయి. అనురాగ ధారల్ని వర్షిస్తున్నాయి.

ఆమె నవ్వింది.

ఉలిక్కిపడ్డాను.

ఒకసారి నేను 'బువ్వ' తిననంటే వెండి గిన్నెలో పెట్టుకుని డాబా మీదకి తీసుకెళ్ళి చందమామని చూపిస్తూ కథలు చెబుతూ గోరుముద్దలు తినిపించింది అమ్మ. నాకు తెలీకుండానే గిన్నెలోనిదంతా తినేశాను. అప్పుడు అమ్మ నా వంక చూసి నవ్వినట్టుగానే ఉందీమె నవ్వు. ఎంత చిత్రం!

సందేహం లేదు ఈమే మా అమ్మ.

మరి ఆగలేకపోయాను. ఇనుప డోర్ తీసి ముందుకెళ్తోంటే నన్ను ఆపబోయింది వరలక్ష్మి. ఆమె చేతుల్ని తోసేసి వార్డెన్ సార్‌తో మాట్లాడుతోన్న ఆమె దగ్గరికెళ్ళాను. పొలాన్నుంచి తిరిగొస్తోన్న తల్లి ఆవుకి ఎదురెళ్ళే ఆవుదూడలా గబగబా వెళ్ళాను.

ఆమె తప్ప నాకింకెవరూ కన్పించట్లేదు.

"అమ్మా!"

ఆమె తుళ్ళి పడి చూసింది. ఆమె ప్రక్కనున్నతను నుదురు చిట్లించాడు. వార్డెన్ సార్ నోరు తెరిచారు. వాళ్ళనెవర్నీ పట్టించుకోలేదు. అమ్మనే - అమ్మనే చూస్తూ దగ్గరి కెళ్ళాను.

"అమ్మా! నేను....రాంబాబుని.....చిన్నికొండా అంటూ నువ్వు పిలిచేదానివే ఆ రాంబాబుని నేనే....నన్ను గుర్తు పట్టలేదా అమ్మా.....?!"

నా కన్నీళ్లు తుడుస్తూ "ఎవరు బాబూ నువ్వూ......" అంది మాటల్లో ఆప్యాయత రంగరించి.

"నేనమ్మా నీ చిన్నికొండని......గోదావరి పుష్కరాల్లో నీ చేయి పట్టుకుని నడుస్తూ మధ్యలో రకరకాల బెలూన్లు కన్పిస్తే ఆగి చూశాను. తర్వాత చూస్తే నువ్వూ నాన్నా కన్పించలేదు. మీ కోసం ఏడుస్తూ అటూ ఇటూ పరుగెత్తాను. జనప్రవాహం నన్ను ఎటో తోసేసింది. ఎంత వెదికినా మీరు కన్పించలేదు.....ఎంతేడ్చినా మీర్రాలేదు.....!"

వెక్కి వెక్కి ఏడుస్తోంటే నా తల నిమిరి, "మీ అమ్మ పేరేంటీ" అనడిగింది.

"కమల"

"ఎక్కడైనా కన్పిస్తే చెబుతాన్లే....."

"లోపలికి ఫోరా ఫో....." వార్డెన్ సార్ కసిరారు.

"మా అమ్మ........"

"అమ్మా లేదు బొమ్మా లేదు. ఫో......ఏయ్ వర్లక్ష్మీ వీడ్ని లోపలికి తీసుకు ఫో....."

వార్డెన్ సార్ కోప్పడేసరికి భయమేసింది.

అమ్మ వంకే చూస్తూ వరలక్ష్మి వెంట అనాథాశ్రమం లోపలికెళ్ళాను.

"మీరేమీ అనుకోకండి. వచ్చిన ప్రతివారిలోనూ అమ్మా నాన్నల్ని వెదుక్కుంటూ ఉంటారు. ఎవరూ లేని అనాథలు కదా!"

వార్డెన్ సార్ మాటలకి "వాళ్ళమ్మ నాలా ఉండేదేమో" అందామె నా వంక జాలిగా చూస్తూ.

'నీలా ఉండటం కాదమ్మా నువ్వే మా అమ్మవి.... ముమ్మాటికీ నువ్వే – నువ్వే మా అమ్మవి......' నా గుండెలు పిచ్చిగా అరుస్తున్నాయ్ !

"ఆ అమ్మని చూడు వర్లక్ష్మీ.......మా అమ్మే......" ఫిర్యాదు చేశాను.

"మీ అమ్మ కాదురా. ఆవిడ తెల్లగా ఉంది. నువ్వు నల్లగా ఉంటావు...."

"మా అమ్మ కాదా? పేరు అడుగు......"

"అడగక్కర్లేదు. వాళ్ళకస్సలు పిల్లలు పుట్టలేదంట. మన ఆశ్రమంలోని ఒకర్ని తీసుకెళ్ళి పెంచుకోడానికొచ్చారు" నచ్చచెబుతూ అంది వరలక్ష్మి.

"అంతా అబద్ధం. మా అమ్మే. నన్ను తీసుకెళ్ళడానికే వచ్చింది....."

"కాదురా. వాళ్ళు నీలాగ నాలాగ పదేళ్ళ వాళ్ళని కాదు చిన్న చిన్న బాబుని గాని పాపని గాని తీసుకెళ్తారు....."

"నేను చిన్నోడిగా ఉంటే బావుణ్ణు కదా అక్కా! దేవుడా! నన్నెందుకు పెద్దోడ్ని చేశావు? మళ్ళీ చిన్నోడ్ని చేసెయ్! ఇప్పుడే చేసెయ్!" అక్కని వాటేసుకుని బావురుమన్నాను.

లేని పెద్దరికం మీదేసుకుని నా తల, వీపు నిమురుతూ దిగులుగా చూస్తూండి పోయింది వరలక్ష్మి.

అవాళ అన్నం తినలేదు. ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. 'అమ్మా' 'అమ్మా' అంటూ కలవరిస్తూనే ఉన్నాను!

* * *

"రాంబాబు ఎవరు?" క్లాసులోకొస్తూనే అడిగారు మేడమ్.

కంగారుపడ్డాను. సన్నగా వణికాను.

మేడమ్ మా కాలేజీకి కొత్తగా వచ్చిన తెలుగు లెక్చరర్. చక్కగా బావుంటారు. బహుశా మా అమ్మ ఇప్పుడిలాగే ఉండి ఉంటుంది. నేత చీర కట్టుకుని కళ్ళజోడు పెట్టుకుని హుందాగా నడుస్తూ తీయగా మాట్లాడుతూ......!

ఆవిడ మా అమ్మేమోనని చాలా ఆశగా చాలాసార్లు చూశాను. చూస్తూనే ఉన్నాను. అది గ్రహించి నా పేరు కనుక్కుని నా మీద కోపంతో......!

తప్పు చేసిన వాడిలా తలొంచుకుని నిలబడ్డాను.

"కమాన్.....ఇలారా....."

క్లాసందరి ముందూ ముక్కచివాట్లు తప్పవనుకుంటూ అడుగులో అడుగువేసుకుంటూ సమీపించాను.

"మీ అమ్మా నాన్నా ఏం చేస్తారు?"

"లేరు మేడమ్......."

"ఐసీ. తాతయ్యా మామ్మా పెంచారా?"

"ఊహూఁ......" నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారలుకట్టాయి.

"అరెరె ఏమైంది రాంబాబూ....." కలవరపడిందామె.

"అతడు అనాథ మేడమ్" ముందు బెంచీలోని ఒకరన్నారు.

"షటప్. నేనూ మీరు ఈ ఊరూ రాష్ట్రమూ దేశమూ ప్రపంచమూ ఉండగా ఇతడు అనాథ ఎలా అవుతాడు? ఈ భూ ప్రపంచం మీద రెండో మనిషి లేనపుడే మొదటివాడు

అనాథ అవుతాడు. ఏడవకు రాంబాబూ. నీకు మేమంతా ఉన్నాం.....”

ఆర్తిగా ఆసక్తిగా ఆశగా చూశాను.

కళ్ళతో భరోసా ఇస్తూ నా భుజం చరిచింది.

చిన్నప్పుడోసారి చీకట్లో ఒంటేలుకి పోసుకోడానికి వీథిలోకెళ్ళినప్పుడు చింతచెట్టు మీద ఏదో కదిలింది. ‘బాబోయ్ దెయ్యం’ అని అరుస్తూ ఇంట్లోకి పరుగెత్తుకొచ్చేశాను.

అప్పుడు అమ్మ ఇలాగే నాకు ధైర్యం చెప్పింది. నీకు నేనున్నానని భరోసా ఇచ్చింది.

‘నీ మెడలోని తాడుకి ఆంజనేయస్వామి బిళ్ళ ఉందికదా నీ జోలికి గాలీ ధూళీ ఏవీ రావు గాక రావని’ నమ్మ బలికింది. కొండంత నిశ్చింతనిచ్చింది.

ఇప్పుడీ మేడమ్ కూడా...... మేడమ్ పేరు కమలాబాయి కదా?! మా అమ్మేనేమో. పై చదువులు చదివి లెక్చరర్ అయ్యిందేమో!

విత్తనమంత ఆశ క్షణాల్లో మొలకెత్తి మొగ్గతొడిగి మొక్కై మ్రానయ్యింది!

“ఇతడ్ని చూసి మీరు చాలా నేర్చుకోవాలి. ఇతడి అక్షరాలు చూడండి ముత్యాలకోవల్లా ఉన్నాయి. తప్పుల్లేకుండా చక్కని తెలుగు రాశాడు. భావ వ్యక్తీకరణా బావుంది. మొన్నటి అర్థవార్షిక పరీక్షల్లో ప్రథముడిగా నిలిచిన ఈ రాంబాబుని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఇతడు ఎన్నో ఎత్తులకు ఎదగాలని ఆశిస్తున్నాను.....”

తప్పట్లు మార్మోగాయి.

మంత్రించినట్లుగా నా చుట్టూ వున్న వారంతా మాయమైపోయారు ఒక్క మేడమ్ తప్ప.

ఆరాధనగా చూస్తూ “అమ్మా!” అన్నాను.

ఆవిడ అర్థంకానట్టు చూసింది. అయోమయంగా చూసింది.

“అమ్మా!” ఆర్తిగా పిలిచాను మళ్ళీ.

“వెళ్ళి కూర్చో” పరీక్ష పేపరు అందిస్తూ అంది.

“మీరు.....మీరు.... మా అమ్మ కాదా?”

విస్తుబోయింది. అంతలోనే తేరుకుని, “మీ అమ్మనాలాగా ఉండేదా?” అనడిగింది.

నిలువుగా తలాడించాను.

“ఐ పిటీ యూ. వెళ్ళు చిన్ని కొండా!”

“మా అమ్మ నన్నలాగే పిలిచేది”

సుతారంగా సితార మీటినట్లు నవ్వింది. "మా అమ్మ కూడా నన్నలాగే పిలిచేది....."

హతాశుడ్నయ్యాను.

"ప్రపంచంలో మనిషిని పోలిన మనుషులు ఎనిమిది మంది ఉంటారట. మీ అమ్మ పోలికలు నాలో ఉండొచ్చు. అంతమాత్రాన నేను మీ అమ్మని కాను......"

"మీదీ మా అమ్మ పేరే....."

"యాదృచ్ఛికం కావొచ్చు....నాకసలు పెళ్లే కాలేదు!"

కాళ్ళ క్రింది భూమి కంపించింది.

అవాళ ఆకలి చచ్చిపోయింది. ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. అమ్మకోసం కలవరిస్తూనే ఉన్నాను!

* * *

బ్యాంకు ఉద్యోగస్తుడ్నయ్యాను.

హోదా వచ్చింది. ఆదాయం బావుంది. గుర్తింపూ గౌరవమూ నడుచుకుంటూ వచ్చేశాయి.

అయినా అమ్మలేని బాధ సెలవేస్తూనే ఉంది.

బ్యాంకు ఖాతాదారుల్లో బజార్లలో ప్రయాణాల్లో అమ్మ కన్పిస్తుందేమోనని నా కళ్ళూ మనస్సూ నిరంతరం వెదుకుతూనే ఉన్నాయి.

మా బ్యాంకు మేనేజరు ఓ పెళ్లి సంబంధం తీసుకొచ్చారు. ఆయన పోరు పడలేక ఓ రోజున ఆమెని చూడటానికెళ్ళాను.

ఆ అమ్మాయి పేరు అరవింద. సన్నగా పొడుగ్గా ఉంది. కోలమొహం. చిన్ని కళ్ళు. ఎంచేతో ఒక్కసారీ నవ్వలేదు.

ఆమె అమ్మలా ఉండాలని ఆశించాను. కనీసం అమ్మ రూపురేఖల్లోని ఏదో ఒక అంశమైనా ఉందుంటే బాగుణ్ణను కున్నాను. ప్చ్. ఎక్కడా పోలికేలేదు!

అసంతృప్తిగా ఫీలయ్యాను. దారుణంగా మోసపోయినట్టుగా ఉంది !

"అమ్మాయి నచ్చింది కదా?" మేనేజరు మాటలకి నా అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పాను.

"ఆలి అమ్మలా ఉండకూడదు. అమ్మ అమ్మే భార్య భార్యే. నీకు వెనకా ముందూ ఎవ్వరేరు. అరవిందకి బోల్డంతమంది బంధుజనం ఉన్నారు. ఇక వాళ్ళంతా నీ బంధువులే

అవుతారు. వార్ని అభిమానంతో అనుబంధాలతో ఉక్కిరిబిక్కిరవడం ఖాయం. నీకేమైనా ఆస్తిపాస్తులున్నాయా?"

"లేవు సార్"

"అరవింద ద్వారా నీకు డబ్బూ దస్కం బాగానే ముడతాయి. అదీగాక నామాట తీసెయ్యలేక వాళ్ళు నీ సంబంధానికి ఒప్పుకున్నారు గానీ లేకపోతే తాడూ బొంగరం లేని నీకు పిల్లనివ్వడానికెవరూ ముందుకు రారు. నిన్ను 'కాపు' కాయడానికి తల్లి రెక్కలే కాదు ఏ రెక్కలూ లేనివాడివి. నేల విడిచి సాము చెయ్యాలనుకోకు. ఊరికే ఎగరాలని ప్రయత్నిస్తే కాళ్ళిరగటం ఖాయం!"

ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే ఆయన మొఖం ఎర్రబడింది. కఠినంగా మారింది.

ఊపిరి సలపనట్టుగా అనుభూతించాను.

ఈమెని గాకపోతే మరో బొమ్మని పెళ్లి చేసుకోవాలి. ఆమె కూడా ఈ అమ్మాయిలానే ఉండొచ్చు. ఉండకపోనూ వచ్చు. నా మంచి చెడ్డలు చూడటానికి అమ్మలేదు. నాన్న లేడు. అయినవాళ్ళూ లేరు. నా మేలుకోరి మేనేజరు పూనుకున్నందుకు ఆయన్ని అభినందించాలిగాని నొప్పించడం సంస్కారం కాదన్పించింది.

"నా మీదా నా మాట మీదా నమ్మకం లేదా? నేన్నీ బాగు కోరేవాడ్నే గాని శత్రువుని కాదయ్యా" మేనేజరన్నారు అసహనంగా.

మరింక ఎదురు మాట్లాట్టానికి నోర్రాలేదు.

"మీ ఇష్టం సార్. మీకెలా బావుంటుందంటే అలా చెయ్యండి"

ఆయన మొఖం విప్పారింది.

"అదీ పైకొచ్చే లక్షణం!" అన్నారు.

నెల తిరక్కుండా అరవింద నా భార్య అయింది.

అరవింద మంచిదే. పనీ పాటా వచ్చు. కానెంచేతో నేనంటే చిన్నచూపు. నాకు పద్ధతులు తెలీవంటుంది. ఎవర్తో ఎలా కలసిపోవాలో తెలీదంటుంది. అనుబంధాలు మెయిన్‌టెయిన్ చెయ్యడం బొత్తిగా రాదంటుంది.

మరీ కోపం వచ్చినప్పుడు 'అసలు నువ్వెవరివో ఎవరికి పుట్టావో ఎలాటి నింద భరించలేక మీ అమ్మ నిన్ను వదిలేసి పోయిందో అసలు నీ కులమతాలేంటో" అని వాడి బాణాలు బలంగా గుండెల్లో గుచ్చి గాయపరుస్తూంటుంది!

నేనేం చెప్పినా 'కాదు' 'రాదు' 'తెలీదు' అంటుంది. పెదవి విరుస్తుంది. వెక్కిరిస్తుంది. గొణుక్కుంటుంది. విసుక్కుంటుంది.

ఆమె చెప్పినట్టే చెయ్యాలంటుంది. ఉండమన్నట్టే ఉండాలంటుంది. తను గీచిన గీటు మీదే నడవాలంటుంది.

అలాగే ఉంటున్నాను. అణగి ఉంటున్నాను. భయంగా బెదురుగా ఉంటున్నాను. నా ఇంట్లోనే నేను పరాయివాడిలా.....!

అమ్మ ఉంటే ఇలా అస్వతంత్రుడిలా ఉండాల్సొచ్చేదికాదు. నాకు వెన్నుదన్నుగా ఉండేది. ప్రేమాభిమానాల్తో ముంచెత్తేది. లాలించేది. ధైర్యం చెప్పేది. నా మీద ఈగని కూడా వాలనిచ్చేదికాదు. అంతేకాదు అరవిందని అలా పెత్తనం చేయనిచ్చేదీ కాదు.

నా బంగారు బాల్యపు రోజుల్లో అలిగినా అల్లరి చేసినా అమ్మ ఎంత అనునయించేది. తప్పు చేస్తే ఎంత చక్కగా వివరించేది. భయమేస్తే అక్కున చేర్చుకునెలా ఓదార్చేదీ! ఎంత ధైర్యం నూరి పోసి మరెంత భరోసా ఇచ్చేదీ!

నిజంగా అమ్మంటే ప్రేమ. ధైర్యం. నమ్మకం. భరోసా. ఆశ – అన్నీను!

అమ్మ ఎక్కడుందో, ఎలా ఉందో, ఏం చేస్తోందో, నన్నెప్పుడైనా తలచుకుంటోందో లేదో!

అమ్మా! అమ్మా! నీ ఈ చిన్ని కొండ చేయి వదిలేశావేమమ్మా! నేను తెగిన గాలి పటాన్నైపోయానమ్మా! నువ్వు లేని లోకం మీద ప్రేమ కలగటం లేదమ్మా. నువ్వు లేని లోకం వద్దనిపిస్తోందమ్మా. అమ్మలేని దౌర్భాగ్యం పగవారిక్కూడా రాకుండా చూడమని రోజూ దేవుడ్ని ప్రార్థిస్తున్నానమ్మా! అమ్మా అమ్మా ఒక్కసారి కనిపించవూ? ఒక్కసారి – ఒకే ఒక్కసారి నన్ను దగ్గరకి తీసుకుని ముద్దివ్వవూ?

దు:ఖోధృతి తట్టుకోలేక నా గుండెలు ఘూర్ణిల్లుతున్నాయి!

* * *

కుండపోతగా వర్షం కురుస్తోంది.

లోకంలోని అన్యాయాల్ని చూసి తట్టుకోలేక ఆకాశం భోరున ఏడుస్తున్నట్టుంది.

రెయిన్‌కోటు ధరించి స్కూటర్ మీద బ్యాంకు పని ముగించుకుని ఇంటికెళ్తున్నాను.

దారిలో ఒక చెట్టు క్రింద ఎవరో ముసలావిడ ముడుచుకుని పడుకునుంది.

కాస్త ముందుకెళ్ళిన వాడ్నే వెనక్కి తిరిగొచ్చాను. వానలో తడుస్తూ వణకుతోంది.

"ఎవరండీ.....ఎవరూ....ఇక్కడ పడుకున్నారేం......అయ్యయ్యో తడిసి ముద్దై పోయారు" ఆవిడ్ని కూర్చోబెట్టి కుదుపుతూ అడిగాను.

ఆవిడలో కదలిక లేదు. నాడి చూశాను. బలహీనంగా కొట్టుకుంటోంది. మరో ప్రక్క చీకట్లు ముసుర్తున్నాయి.

మరొక్కక్షణం వృథా చెయ్యలేదు. అంబులెన్సుకోసం ఫోన్ చేశాను.

ఆసుపత్రిలో రెండు గంటల పాటు రకరకాల వైద్యం అందిచ్చారు. సెలైన్ ఎక్కించారు. మగతగా పడుకుని వుంది.

ఆమె త్వరగా కోలుకోవాలని ఆశిస్తూ మంచం ప్రక్కనే పాతుకుపోయాను. ఆమెనే చూస్తూ చూస్తూ........!

ధవళ వస్త్రాలు ధరించిన ఓ దేవతామూర్తి నా తలని ఒళ్ళోకి తీసుకుంది. ముఖం తుడిచి నుదుట ముద్దు పెట్టుకుంది. కళ్ళు తెరచి అపనమ్మకంగా చూశాను. అది అద్భుత కాదు కాదు అమృతలోకం! ఆమె నవ్వింది. బతుకుమీద అంతులేని ఆశనీ అనంతమైన ప్రేమనీ నా నరనరంలోకీ ఎక్కించింది.

"అమ్మా!" అరిచాను.

"ఏమయ్యింది నా చిన్నికొండా"

ఉలిక్కిపడ్డాను. కళ్ళు తెరిచాను. చిత్రంగా ఆమె ఒడిలో నేను. నావంక అమృతపు చూపుల్తో చూస్తోందామె.

చటుక్కున లేచి కూర్చున్నాను. నిద్ర ఆపుకోలేక మంచం మీద తూలితే ఆమె ఒడిలోకి తీసుకుందన్నమాట !

లోకంలోని అందరు అమ్మల ప్రేమలూ, చూపులూ, చిర్నవ్వులూ ఒరే రకంగా ఉంటాయేమో!

లయ తప్పినగుండెల్ని చిక్కబట్టుకుంటూ "మీరెవరు? ఎవరి తాలూకు?" అని ప్రశ్నించాను.

"దురదృష్టవంతురాల్ని"

"కళ్ళు తిరిగి పడిపోయారా?"

తల అడ్డంగా ఊపింది.

"మరి......!"

పేలవంగా నవ్వింది. చెప్పడానికి ఇష్టం లేనట్టు ఉండిపోయింది. రెట్టించాను. నా మొఖంలోకోసారి చూసి అంది. "ఏం చెప్పను? పేగు తెంచుకుపుట్టిన బిడ్డలకు గుండెల మీది కుంపటిలా ఉన్నానుట!"

"మీ పిల్లలు అమ్మ వద్దనుకున్నారా?" సంభ్రమంగా అడిగాను.

నా మాటలు విన్పించుకోకుండా ఎటో చూస్తూ చెప్పుకుపోయింది. "వాళ్ళింతా ఇంతా ఉన్నప్పుడు వాళ్ళ నాన్న నా చేయి వదిలి పై లోకాలకెళ్ళిపోయారు. దారీ తెన్నూ కన్పించలేదు. చచ్చిపోదామనుకున్నాను. పిల్లలు కాళ్ళకడ్డం పడ్డారు. వాళ్ళ కోసం బతికాను. వాళ్ళే లోకంగా బతికాను. వాళ్ళు అమ్మలేని దరిద్రులు కాకూడదని బతికాను....."

ఆమె ఆగింది. గుండెల్నిండా గాలి పీల్చుకుంది.

బాధగా ఆమెనే చూస్తూండిపోయాను. చూస్తోంటే నాకన్నా ఎక్కువగా కన్నీళ్లు కార్చినట్టుంది!

"నా రక్తమాంసాలు పంచిచ్చిన నా బిడ్డలకోసం రెక్కల్ని ముక్కలు చేశాను. ఎముకల్ని అరగదీశాను. కండరాలని కరిగించాను. నేను చెయ్యని పని లేదు. పాచి ఊడ్చాను. వంటలు చేశాను. బరువులు మోశాను. నా కష్టం వృథా పోలేదు. నా పిల్లలు ముగ్గురూ ప్రయోజకులయ్యారు....!"

"వాళ్ళు చాలా అదృష్టవంతులు. ముగ్గురూ కలిసి రోజూ మిమ్మల్ని బంగారు పూలతో పూజిస్తూండి ఉంటారు. ఎన్ని పూజలు చేసినా అమ్మ ఋణం తీరదు కదా !"

నవ్వింది. ఆ నవ్వు భీతిగొల్పింది.

"అవునూ. అందివచ్చిన కొడుకులున్నాక ఎవరూ లేనివారిలా రోడ్డు ప్రక్కన వర్షంలో ఎందుకు పడి ఉన్నారు? మీకంత కర్మేం వచ్చి పడింది?"

"నుదుట రాత!" అంది వేళ్ళతో నుదురు రాస్తూ.

అయోమయంగా చూశాను. వేదనగా చూశాను.

"పెళ్లిళ్ళయ్యాయి. పెళ్లాలొచ్చారు. వాళ్ళు బెల్లమయ్యారు. నేను అల్లమయ్యాను. నాన్న ఆస్తి మాదే అంటూ ఇన్నేళ్ళూ నీడనిచ్చిన గూడుని అమ్మేశారు. పంచేసుకున్నారు. నన్ను ముక్కలు చేసి పంచుకోలేక మూకుమ్మడిగా వదిలించు కోవాలనుకున్నారు. అలా చేతులు కడిగేసుకోడానికి చేతులు కలిపారు!"

"ఎంత దారుణం!"

"నీకు తెలీదులే బిడ్డా. నేను చాలా బరువంట. మోయలేరంట. వాళ్ళని నవ మాసాలపాటు ఇదిగో ఈ కడుపులో మోసిన సంగతి వాళ్ళకి గుర్తులేదుట. అందుకని ముగ్గురూ కలిసి వర్షంలో నన్ను చెట్టుకాడికి తీసుకొచ్చి వదిలేశారు. నా చావు నన్ను చావమని నోటితో చెప్పకుండా చెప్పి వెళ్ళిపోయారు. కన్నబిడ్డల చేతుల్లో చావడం కన్నా అదృష్టం ఏముంటుందని అక్కడే అలాగే పడి ఉన్నాను. నువ్వు నన్ను రక్షించకుండా వుంటే ఈ పాటికి ఈ బాధలవైతరిణిని దాటేసేదాన్ని!"

ఆమె ఏడవటం లేదు. కాని కన్నీరు మౌనంగా కారసాగింది రెండు కళ్ళనుంచీ.

అమ్మ లేక నాలాటివాళ్ళు అనాథలయ్యారు. కన్నబిడ్డలున్న అమ్మ అనాథ అవడమా! ఇంత దారుణమైందా కలికాలం!

ఆమె దు:ఖపు మాటలు కాదు బాధా శకలాలు నా గుండెల్ని మెలితిప్పుతోంటే మరి నిలవలేకపోయాను. బయటికి దూసుకెళ్ళి బైక్ స్టార్ట్ చేశాను.

గుండెలు నిలువునా పగిలినందున కాబోలు ఆకాశం హోరున విలపిస్తోంది. ఆ కన్నీటి ధారల్లో తడుస్తూ కటిక చీకటిని చీలుస్తూ ఆమె ఇంటికెళ్ళాను.

లోపల లైట్లు వెలుగుతున్నాయి.

తలుపు తట్టగానే తీశారు. కంగారు పడుతూ చూశారు. వారి వంక పరిశీలనగా చూశాను.

ముగ్గురబ్బాయిలూ వారి భార్యలూ ఆందోళగా ఉన్నారు. నా వంక ఎవరన్నట్టు చూశారు. ఆ కళ్ళల్లో లోకభీతి ఉంది! అపరాధ బావనా ఉందేమో!

"మీ అమ్మగారు......."

"చనిపోయిందా?" ముగ్గురూ ఒక్కసారే అన్నారు.

"చనిపోవాలనుకుంటున్నారా?

"అహ అది కాదు. ఇంట్లో ఇమడలేనంటూ తనే వెళ్ళిపోయింది. ఊరంతా వెదికి వేసారి ఇప్పుడే వచ్చాం....."

"ఇక వెదకక్కర్లేదు. ఆమె ఆసుపత్రిలో ఉంది. క్షేమంగా ఉంది. రండి తీసుకొద్దురు గాని...."

వారెవరూ కదల్లేరు. నా వంక విసుగ్గా కోపంగా చూశారు.

"ఇదెక్కడి ఘోరం చెప్పండి? అమృతాన్ని పంచే దేవతనెవరైనా చంపుకుంటారా? మిమ్మల్ని లోకం కసాయి వాళ్ళని నిందించవచ్చు. కాని మీ అంత దురదృష్టవంతులు లోకంలో ఉండరు గాక ఉండరు. అమ్మ విలువ ఏమిటో నాలాగా నాల్రోజులు అనాథలా బతికితే తెలుస్తుంది!"

"ఇది మా కుటుంబ వ్యవహారం. నీ జోక్యం అనవసరం" కఠినంగా అన్నారు.

"అమ్మ మీకు కావాలా అక్కర్లేదా?"

"నీక్కావలిస్తే మెడకి కట్టుకుని ఊరేగు"

"థాంక్స్. నేను అమ్మార్తుడ్ని. నాకు అమ్మ కావాలి. అమ్మ ప్రేమామృతం దోసిళ్ళతో త్రాగాలి. ఆ ప్రత్యక్ష దైవం ఇంట్లో తిరిగితే నా జీవితమే ఒక పండగవుతుంది. నా జన్మా పండుతుంది"

వాళ్ళు నన్నో పిచ్చోడిలా చూస్తోంటే విసవిసా బయటికొచ్చాను.

వాళ్ళకు తెలీదు. నేను చిన్నప్పుడే తప్పిపోయాను. అమ్మని పెద్దప్పుడు 'వాళ్ళు' తప్పించారు. ఇప్పుడు మేమిద్దరం ఒకే పడవలో ఉన్నాం. ఒకరికొకరం ఆలంబనం కాబోతున్నాం. మళ్ళీ అమ్మకళ్ళల్లో వెన్నెల పూలు పూస్తాయి. అవి నన్ను సేదదీర్చి చేయి పట్టుకుని నడిపిస్తాయి!

మనస్సు వెర్రి సంబరంతో పిల్లి మొగ్గలేస్తోంది. గుండెల్నిండా గుండెలు పట్టనంత ఆనందం - కాదు పరమానందం!

'అమ్మా' అని పిలవడానికి కేవలం ఆ పిలుపుతోనే ధన్యుడ్నవడానికి ఆనందోద్వేగంతో ఊగిపోతూ ఆసుపత్రి వైపు బైక్‌ని ఉరికించాను.

**(జాగృతి వారపత్రిక 3.2.14)**